## మంత్రి కేటీఆర్‌ను కలిసిన శ్రావణ్



మంత్రి కేటీఆర్‌తో శ్రావణ్

కేసముద్రం, నవంబర్11: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను శనివారం ప్రగతిభవన్‌లో కేసముద్రం మండలం కేసముద్రం విలేజి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ముదిరెడ్డి శ్రావణ్ మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చేవిధంగా యువత కృషి చేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్రంలోని ప్రజలందరికీ లబ్ధి కలుగుతుందని చెప్పినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శశాంక

## స్వీప్ కార్యక్రమాన్ని విభిన్నరీతిలో చేపట్టాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక**

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 11: ఓటరు చైతన్య అవగాహన కోసం చేపడుతున్న స్వీప్ ఎన్నికల ప్రచారాన్ని విభిన్న రీతిలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయంలో స్వీప్ నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల స్వీప్ కార్యక్రమాన్ని ప్రణాళికా ప్రకారం రూపొందించాలన్నారు. ఓటరు నమోదు తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో తప్పనిసరిగా స్వీప్ ప్రచారం నిర్వహించాలన్నారు. పట్టణంలోని ప్రధాన జన సమూహ ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టాలన్నారు. ఫ్లెక్సీలు, కటౌట్ ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారథుల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కొవ్వొత్తుల ర్యాలీ, రంగోలీ ద్వారా భారీ ప్రదర్శన చేయాలన్నారు. జిల్లాలోని ప్రజలందరికీ తెలిసే విధంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన చేపట్టాలని ఆదేశించారు. వాకర్స్, స్వచ్ఛంద సంస్థల ద్వారా మరింత చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీలకు మునిగలవీడు విద్యార్థులు

నెల్లికుదురు, నవంబర్ 11: మండలంలోని మునిగలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన బీ దనుశ్, ఎం ప్రవీణ్‌కుమార్ జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చారు. ఈనెల 16న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్ రాజేశ్‌ను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## బీఆర్ఎస్ గ్రామ ప్రచార కమిటీ చైర్మన్‌గా భద్రయ్య



ఇనుగుర్తి, నవంబర్ 11: మండలంలోని చిన్ననాగారం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా బైరు భద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ గ్రామ అధ్యక్షుడు మద్దెల సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపాడు. వైస్ చైర్మన్‌గా బొబ్బల ముత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా వడపెల్లి కొండయ్య, కోశాధికారిగా పింగిళి రాజిరెడ్డి, గ్రామ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బత్తిని మురళీ గౌడ్, ప్రచార కమిటీ సభ్యులుగా మద్దెల కరుణాకర్, శీలం శ్రీను, కౌంటం నాగేందర్, చెడుపాక చిన్న యాకూబ్, చిర్రబోయిన దేవరాజు, చిర్రబోయిన సతీశ్, కౌంటం రాంబాబును ఎన్నుకున్నట్లు పేర్కొన్నాడు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

నెల్లికుదురు, నవంబర్ 11: మండలంలోని జామతండాకు చెందిన గుగులోత్ నరేశ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతడి చిన్ననాటి స్నేహితులు శనివారం నరేశ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నరేశ్ మృతి చెందడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని, వారికి ఎల్లవేళలా తోడుగా ఉంటూ తోచిన సాయం చేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్‌కు ఓటేసి ఆగం కావద్దు

- కేసీఆర్ పాలనలోనే తండాల్లో సకల సౌకర్యాలు
- రేవంత్‌రెడ్డికి గిరిజనులు బుద్ధి చెప్పాలి
- సంక్షేమ పథకాలపై ఊళ్లలో చర్చ జరగాలి
- మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే..
- అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోను అమలు చేస్తాం..
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 11 : కాంగ్రెస్ పార్టీకి ఓటేసి ఆగంకావొద్దని, అభివృద్ధి చేసిందెవరో.. మోసం చేసిందెవరో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కోరారు. శనివారం ఆయన మహబూబాబాద్ మండలంలోని దర్గాతండా, సీత్లతండా, వేంనూరు, చిన్నకిష్టాపురం, ఇందిరానగర్, ఉత్తరతండా గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ, చేసిన అభివృద్ధిని వివరించి ఓటు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లోని ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలు రాగానే తండాలకు అనేక పార్టీల నాయకులు వచ్చి మాయమాటలతో మోసం చేయాలని చూస్తారని, నిరుపేదలకు అండగా ఉన్నదెవరో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ తండాలను ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అన్ని విధాలా అభివృద్ధి చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడి రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలనడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవన్నారు. గిరిజనులను కించపరుస్తూ మాట్లాడిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోని పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిత్యం మీ మధ్యనే ఉంటున్న తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రియాంక, కేసన్‌రెడ్డి, నాయిని రంజిత్, తేళ్ల శ్రీను, అశోక్‌నాయక్, ఆవుల వెంకన్న, భూక్యా సురేందర్, మందుల రఘు, దామూనాయక్, నవీన్‌నాయక్, నలమాస శ్రీను, నర్సింగ్ వెంకన్న, నలమాస సాయి, షరీఫ్, రామచంద్రు, బాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

టీడీపీ మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా సునీతా మంగీలాల్ శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు సునీత తెలిపారు.

# ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నివర్గాల అభివృద్ధి
- అభివృద్ధి ప్రదాత శంకర్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు



మ్యానిఫెస్టో కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కేసముద్రం, నవంబర్ 11: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేదలు మరింత అభివృద్ధి చెందుతారని పార్టీ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరూనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ గెలుపు కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మఒడి, ఆసరా పింఛన్లు వంటి పథకాలు పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలిగిస్తున్నాయని వివరించారు. 24 గంటల విద్యుత్ సరఫరా, సాగు నీరు, మద్దతు ధర అందించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రూ.400లకు గ్యాస్, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.3వేలు, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా, రూ.15లక్షల వరకు ఆరోగ్యశ్రీ, రైతులకు ఎకరానికి రూ.16వేల పెట్టుబడి అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మిట్టగడుపుల మహేందర్, సోమారపు మదార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన చంద్రమౌళి



చంద్రమౌళికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు, నవంబర్ 11: ఉమ్మడి నెల్లికుదురు మండలానికి కాంగ్రెస్, బీజేపీలలో మండల అధ్యక్షుడిగా వ్యవహరించిన కారుపోతుల చంద్రమౌళిగౌడ్ శనివారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కండువా కప్పి పార్టీలో స్వాగతించారు. నెల్లికుదురు జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండా వెంకన్న, చిన్నముప్పారం సర్పంచ్ చీకటి ప్రవీణ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఎన్ మహేశ్, దర్శనం భిక్షపతి, కారుపోతుల సుధాకర్, సుమన్, పల్లె రాము పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లికుదురు, నవంబర్ 11: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై కే క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. కాస్యతండాకు చెందిన మాలోత్ శ్రీను(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యతో మానసికంగా బాధపడుతూ శుక్రవారం చేను వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం శ్రీను మృతి చెందాడు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

***పెనుగొండలో యాకూబ్..***

కేసముద్రం: పెనుగొండ శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి శనివారం తెలిపారు. ఉప్పరపల్లికి చెందిన యాకూబ్(60) ఆటోలో మహబూబాబాద్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో గాయాలవగా వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృ తుడి కుమారుడు జానీమియా ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 290 కిలోల నల్లబెల్లం స్వాధీనం

ఖిలావరంగల్, నవంబర్ 11 : గుడుంబా తయారీ కోసం నల్లబెల్లం, పటికను రవాణా చేస్తున్న వ్యక్తిని వరంగల్ టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ్యాతండాకు చెందిన భూక్యా చంటి (25) రైల్లో 290 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటికను తరలిస్తున్నాడు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నారని తెలిసి హంటర్‌రోడ్డులోని పన్నెండు మోరీల వద్ద రైలులో నుంచి బెల్లం, పటిక బస్తాలను బయటకు విసిరేశారు. విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసులు వెంటనే బెల్లం బస్తాల గురించి టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని బెల్లం, పటిక స్వాధీనం చేసుకొని చంటిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.